# జైలు పక్షి

ఒరియా: అనంత ప్రసాద్ పండా

తెలుగు: డి. కామేశ్వరి; డి. శైలజ

పదేళ్ల కఠిన శిక్ష తరువాత గదాధార్‌ని జైలు నించి విడుదల చెయ్యమని ఆర్డరు వచ్చిన ఆ రోజు అతనికి సుప్రభాతమో, కుప్రభాతమో చెప్పడం కష్టం. పైవాళ్ళయితే బహుశా" పాపం యిప్పటికి వాడి కష్టాలు తీరాయి. పదేళ్లు జైలులో మగ్గి మగ్గి యిన్నాళ్ళకి వాడికి విముక్తి లభించింది. వాడికివాళ తప్పకుండా సుప్రభాతమే అయివుండాలి, వాడి సంతోషానికి పట్టపగ్గాలుండవు "అని అనుకుంటారు - కాని ఏది? ఎక్కడా గదాధార్ మొహంలో సంతోషపు ఛాయలు కనపడ్డంలేదే? వాడి మొహం శ్రావణ మేఘపు ఆకాశంలా విషాదంతో నిండి వుంది. జైలు మెయిన్ గేటు దాటగానే వాడి కళ్ళ నించి అశ్రువులు టపటపా జారిపోసాగాయి. అత్యంత ప్రియమైన వస్తువేదో వదిలి వెడ్తున్నట్టు, ఏదో-పోగొట్టుకున్నట్టు అనిపించసాగింది. ఒక రోజు, ఒక నెలా, ఒక సంవత్సరమూ - పదేళ్ళు యీజైలు ఆవరణలో గడిపాడు. వచ్చిన కొత్తలో "ఎప్పుడు విడుదలయి మామూలు ప్రపంచంలోకి మళ్ళీ అడుగు పెడతానా అని ఆరాటంగా రోజులు లెక్కపెట్టుకునేవాడు. కాని కొన్ని రోజులు జైలులో వుండే సరికి ఆ ఆలోచనలు రూపు మార్చుకున్నాయి. ఇది ఒక వింత ప్రపంచం. దీన్లో నేనో మనిషిని, వీళ్ళంతా నా వాళ్ళు అన్న ఆలోచనలు క్రమంగా చోటు చేసుకున్నాయి. వచ్చిన కొద్ది రోజులకే మంచి ఖైదీ అన్న పేరు తెచ్చుకుని అందరి ఆదరణకి పాత్రుడయ్యాడు. అతని ప్రవర్తన చూసి అతనో హంతకుడు అంటే ఎవరూ నమ్మలేక పోయారు.

జైల్లో గదాధార్ మంచి ప్రవర్తన చూసి జైలు సూపరింటెండెంట్ వాడ్ని "కన్‌విక్ట్ వార్డర్‌"ని చేశాడు ఎనిమిదేళ్ళ క్రితం. ఆ పదవిలోకి వచ్చిన తరువాత వాడికి రాళ్ళు కొట్టడం బియ్యం దంచడం లాంటి కష్టమైన పనులు చేసే అవసరం లేక పోయింది. అప్పటి నించి మిగతా ఖైదీల మీద అజమాయిషీ చేసే వాడు. ఈ పదేళ్ళల్లో చిన్న, పెద్ద నేరాలు చేసి ఎందరో జైలుకి వచ్చారు. ఎంతో మంది విడుదల అయ్యారు. ఓ కొత్త ఖైదీ జైలుకి వచ్చినా, ఓ పాత ఖైదీవిడుదలఅయి బయటకి వెడుతున్నా వాడిమనసు ఓ క్షణం బైటకివెళ్ళడానికి ఊగిసలాడేది. కాని వెంటనే తన మనసులోని బలహీనతని లోపలికి నెట్టేసి మళ్ళీ పనిలో నిమగ్నుడయి పోయేవాడు - సాయంత్రం అయ్యేసరికి ఒకటి, రెండు అంటూ ఖైదీల్ని లెక్క పెట్టడం ఆరంభించేవాడు. చారల చొక్కా - ప్యాంటుతో, బుర్ర మీద నీలం టోపీతో జైలు ఆవరణలో బొంగరంలా అన్నింట్లో తనే అయి తిరిగే వాడు.

కన్‌విక్ట్ వార్డర్ పదవికి వచ్చినా గదాధర్ మిగతా ఖైదీల్ని స్వంత అన్నదమ్ముల మాదిరి చూసేవాడు. ఎవరిమీదా ఎప్పుడూ అధికారం కాని, జులుంకాని చెలాయించలేదు. ఎవరినీ చెయ్యెత్తి కొట్టేవాడుకూడాకాదు. ఎవరైనా కొత్త ఖైదీ తనవాళ్లని ఎవరినో తల్చుకొని కుమిలి పోతూంటే వాడ్ని దగ్గరకి తీసుకుని "ఏడవకు. అన్నాళ్లు అంతే ఎంతసేపు గడిచిపోతాయి, కళ్ళుమూసుకు తెరిచేలోగా గడుస్తాయి. మళ్ళీ మీవాళ్ళతో కల్సి సుఖంగా వుంటావులే, మళ్ళీ దొంగతనం అదీ చెయ్యకు' అంటూ సముదాయించేవాడు. అలా సముదాయిస్తున్నప్పుడు వాడి మనసు బాధతో మూలిగేది! తనకు ఎవరున్నారు?

తల్లి. తండ్రి చిన్నప్పుడే పోయినా, దేవతల్లాంటి అన్న, వదిన తనకి వుండేవారు కొన్నేళ్ళక్రిందట అప్పుడు చేపలు పట్టడం తనకి వృత్తిగా వుండేది. చేపలు పడుతూ కూర్చుంటే తనకిక వళ్లూ పై తెలిసేదికాదు. కాని....తనకి అత్యంత ప్రియమైన చేపలుపట్టే గాలం తన దురదృష్టానికి దారితీస్తుందని ఎన్నడూ అనుకోలేదు. తన వూరి మధ్యలో పెద్ద చెరువు వుండేది. దానిచుట్టూ పెద్ద పెద్ద మర్రిచెట్లు, తాటిచెట్లు వుండేవి. మర్రిచెట్ల ఊడలు ఆచోటంతా ఆక్రమించుకుని ఆ చోటంతా చీకటిగా వుండేది. ఒక మూల కూర్చుంటే ఇంకోవైపు కన్పించేదికాదు. అలాంటిచోట ఏకాంతంగా కూర్చుని చేపలు పట్టేవాడు.

ఒకరోజు మిట్టమధ్యాహ్నం ఒక పొద



లాంటి జాగాలో కూర్చుని గేలాన్ని నీళ్ళలో వేసి చేప ఎప్పుడు తగులుకుంటుందా అని ఎదురుచూస్తూ నిశ్శబ్దంగా కూర్చున్నాడు. అపుడు హఠాత్తుగా అవతలివైపు ఏదో గలభా వినపడింది. చెట్ల సందునించి చూస్తే, ఆవూరి రామ్‌ప్రధాన్ కొడుకు గోకుల్ కమల అనే ఒక అమ్మనింటి పిల్లని చెరచడానికి ప్రయత్నిస్తున్నాడు. కమల అతడి బారినించి తప్పించుకోడానికి గింజుకుంటూ అరుస్తూంది. ఇది చూసి గదాధర్ రక్తం సలసలా కాగిపోయింది. యింకేమి ఆలోచించకుండా ఆ చేపలు పట్టే కర్రపట్టుకు పరుగెత్తి గోకుల్ బుర్రమీద శక్తికొద్దీ బాదాడు. సన్నగా, తీవటలాగ వుండే గోకుల్ ఒక్కదెబ్బకే చావుకేక పెట్టి నేలకూలాడు. గాలానికున్న యినప కొక్కెం అతని మొహాన్ని చీల్చింది. రక్తం వరదలయింది. ఆ కేకలకు చుట్టుపక్కల పొలాల్లోవాళ్ళు పరిగెత్తి వచ్చారు. గోకుల్‌ని అంతా వచ్చి పది మైళ్ళ దూరంలో వున్న ఆస్పత్రికి బండి మీద మోసుకెళ్లారు. రక్తం చాలా పోయి, డాక్టరు ఎంత ప్రయత్నించినా నాల్గు రోజుల కంటే బతక లేదు. రామ్ ప్రధాన్ గదాధర్ మీద హత్యా నేరానికి కేసు ఫైలు చేశాడు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ గదాధర్‌ని దోషిగా నిరూపించడానికి పసందైన కథ అల్లాడు. దాని ప్రకారం, ఆ వూరి హరిరౌత్ రాయ్ కూతురు కమల నీటి కోసం చెరువుకి వెళ్ళినపుడు, అక్కడే వున్న గదాధర్ ఆ అమ్మాయిని మానభంగం చెయ్యడానికి ప్రయత్నించాడు. అప్పుడు అటు వెడుతున్నగోకుల్ ప్రధాన్ అడ్డుపడ్డాడు. అపుడు గదాధర్ గోకుల్ బుర్ర తన దగ్గిర వున్న కర్రతో బద్దలుకొట్టి చంపాడు. బోనులో స్థాణువులా నించుని తన మీద వేసిన అభియోగాన్ని మౌనంగా విన్నాడు గదాధర్. ఆఖరికి పోలీసులు, ఆ ప్రకారం కమల కూడా ఎప్పుడయితే ఆ కథనాన్ని సమర్థించిందో గదాధర్‌కి లోకం అంతా చీకటిగా కన్పించింది. చుట్టూ వున్న అందరిని ముక్కలు ముక్కలుగా నరకాలనిపించింది. కాని ఏమీ చెయ్యలేకపోయాడు. బాహ్య జ్ఞానం లోపించిన వాడిలా ఆలోచిస్తూ నిలబడ్డాడు. జడ్జీగారు అడిగిన ప్రశ్నకి నేను దోషిని కాను అన్నట్టు బుర్రవూపాడు తప్ప నోట్లోంచి మాటరాలేదు. ఆఖరికి నేరం రుజువు చేస్తూ జడ్జిగారు వాడికి పదేళ్ళ కఠిన శిక్ష విధించారు.


ఆ రోజు నించి గదాధర్‌కి యీ ప్రపంచం అంటేనే విరక్తి పుట్టింది. అందుకే జైలు నించి విడుదలయి మానవత్వం నశించిన యీ మనుషుల మధ్యకి, ఈ అబద్ధపు ప్రపంచంలోకి అడుగు పెట్టాలన్న తృష్ణపోయింది. కాని అపుడపుడు అతని అన్న, వదిన గుర్తు వచ్చి హృదయం ఆవేదనతో నిండి పోయేది. వాళ్ళని జన్మలో మళ్ళీ చూడగలనా అని విచారించే వాడు.

జైలుకి వెళ్ళిన ఐదేళ్ళ తరువాత గదాధర్ వూరి వాడొకడు దొంగతనం నేరం మీద జైలుకి వచ్చాడు. వాడి ద్వారా అతని అన్న, వదిన కలరా తగిలి చనిపోయినట్లు, ఆ తరువాత యిల్లు, వాకిలి ఓ వరదలో కొట్టుకుపోయినట్లు తెల్సింది. అప్పటి నించి గదాధర్ బయటి ప్రపంచంతో సంబంధం పూర్తిగా తెంపేసుకున్నాడు,

రాత్రిళ్లు పడుకున్నప్పుడు రకరకాల ఆలోచనలు వచ్చేవి. తన తప్పు ఏమిటి ? ఏ నేరానికి యింత పెద్ద శిక్షపడింది ? చిన్నప్పుడు వంన అవేది మంచి పని చేస్తే భగవంతుడు సంతోషిస్తాడని, అసహాయురాలైన ఒక ఆడదాన్ని రక్షించడం మంచి పని కాదా ? తను కావాలని చంపలేదే ! ఒక స్త్రీని రక్షించడంకోసం చేశాడు. ఇది తన తప్పా-రకరకాల ప్రశ్నలు వేసుకునేవాడు. కాని దేనికీ సరయిన సమాధానం వచ్చేదికాదు. ఆఖరికి యిది నా తలరాత అనుకునేవాడు. అప్పుడప్పుడు వాడికి భగవంతుడి అస్తిత్వం మీదనే సందేహం వచ్చేది. కాని మరుక్షణమే లెంపలేసుకుని "లేదులేదు భగవంతుడున్నాడు, లేకపోతే జైలులో వున్నా యింత ఆనందంగా ఎలా గడపగలుగుతున్నాను అనుకునేవాడు. ఈ జైలులోనే నా మిగతా జీవితం గడిచిపోనీ, భగవంతుడా యింక నిన్నేం కోరను అని మనసులో ప్రార్థించేవాడు. కాని మనిషి అనుకున్నవి అనుకున్నట్టు జరిగితే యింక లేనిదేముంది? తను ఎప్పుడయితే జైలుశిక్ష వద్దు అని విలపించాడో అప్పుడు జైలుశిక్ష పడింది. పరిస్థితులతో రాజీ పడిపోయి యింక బయటికి వెళ్ళకూడదు అనుకున్నాడో అప్పుడు విడుదల చేస్తూ ఆర్డర్లు వచ్చాయి. భగవంతుడి లీలలు ఎంత చిత్రంగా వుంటాయి!








గైడు అంటే దారి చూపించేవాడనేగా అర్థం!!

విడుదలయిన రోజున గదాధర్ ఏడుస్తూ మిగతా ఖైదీలదగ్గిర వీడ్కోలు తీసుకున్నాడు. ఖైదీలుకూడా అతన్ని విడవలేక ఏడ్చేశారు. జైలు సూపరింటెండెంటు యిది చూసి ఆశ్చర్యపోయాడు. మనిషి స్వేచ్ఛ కోరతాడు—విముక్తిలో వున్న ఆనందం యింతా అంతా కాదు. కాని గదాధర్ స్వేచ్ఛ కోరడంలేదు! వాడికి కావల్సింది జైలుబంధనం! ఆ జైలే వాడికి స్వర్గం. ఆ బంధనమే వాడికి ఆనందం!

జైలునించి వెడుతూండగా జైలు ఆఫీసరు అతడి చేతిలో మూడువందల రూపాయలు పెట్టాడు ఈ ఎనిమిదేళ్ళలో కన్‌విక్ట్ వార్డర్‌గా పనిచేసినందుకు వాడికి వచ్చిన పారితోషికం అది. ఆ డబ్బు తీసుకుని పదేళ్ల క్రితం వచ్చినపుడు కట్టుకున్న బట్టలు కట్టుకుని సూపరిం

టెండెంట్ సాహెబ్‌కి నమస్కారం చేసి కన్నీళ్లతో జైలు గేటు దాటాడు.

○ ○ ○

బయటికి వచ్చాక ఎక్కడికి వెళ్లడం అన్న మీమాంసలో పడ్డాడు గదాధర్. ఎవరున్నారు తనకి ? ఆఖరికి తన వూరికి వెళ్లడానికి నిశ్చయించాడు. చీకటిపడేవేళకి వూరు చేరుకున్నాడు. వూరుపొలిమేరకి రాగానే ఆచెరువు కనపడింది మర్రిచెట్టు వూడలు అలాగే వున్నాయి. అవి చూడగానే ఎన్ని పగళ్ళు, స్వాయంత్రాలు అక్కడ గడిపాడో గుర్తు రాసాగాయి. ఆ చీకటిలో మర్రిచెట్ల చాటు నుంచి గోకుల్ జీర్ణావశిష్టమైన శరీరం కన్పించి వికటాట్టహాసం చేసింది. భయంతో గదాధర్ శరీరం కంపించింది కాళ్లు గజగజలాడాయి. ప్రాణా లుగ్గపట్టి వూర్లోకి పరుగు లంకించాడు. యిల్లు చేరి చూసేసరికి వట్టి మొండి గోడలు కనిపించాయి. చుట్టూ పిచ్చి మొక్కలు లేచాయి. నెమ్మదిగా పెరటి వైపు నడిచాడు. అక్కడ పళ్ళతో నిండిన మామిడి చెట్టు కన్పించింది. అది తను స్వయంగా జైలుకి వెళ్ళే ముందు నాటాడు. ప్రేమతో దాన్ని చేత్తో తాకాడు. అక్కడి నించి పొరుగునున్న గోవింద మిశ్రా యింటికి వెళ్ళాడు. మిశ్రా ముసలాడు. పీఠరుగు మీద కూర్చుని జపం చేస్తున్నాడు. గదాధర్‌ని చూసిఎవరూ? అన్నాడు కళ్ళకి చెయ్యడ్డు పెట్టి చూస్తూ. "ఎవరూ, జైలు కెళ్ళినగదాధరేనా మళ్ళీ ఎవరి కొంప కూల్చుతావు బాబూ, వెళ్లు వెళ్లు. లేకపోతే చౌకీదారుని పిలిపించి పోలీసులకి అప్ప చెప్పుతాను. "అని నెట్టి భయంగా లోపలికి వెళ్ళి తలుపు వేసుకున్నాడు. గదాధర్ అక్కడ నించి దామోజెనా యింటి కెళ్లాడు. అక్కడ నించీ వెళ్ళగొట్టారు. మరి యిద్దరు, ముగ్గురుతెలిసిన వారి యిళ్ళలోకూడా అదే సత్కారం జరిగింది. జైలు నించి వచ్చిన వాడికిఅందులోహంతకుడికిఅంతకంటే సత్కారం ఏం జరుగుతుంది. అది గుర్తించాక యింక అక్కడ వుండడానికి మనసు వప్పక వూరు వదిలాడు. దారిలో ఓ దుకాణంలో కూర్చుని, పూరీలు, బూంది తిని టీ తాగాడు. ఇప్పుడు ఏం చెయ్యడం అన్న సమస్య తలెత్తింది. హాయిగా జైలులోనే నయం, రెండు పూటలా తిని, మజాగా గడిపాడు.

○ ○ ○

ఆ రోజు రాత్రి ఆ వూరి మకర్‌సాహు మహాజన్ యింట్లో దొంగ పడ్డాడు. సాహు గారి అరుపులు విని చుట్టు పక్కల యిళ్ళ వాళ్ళు లేచి వచ్చారు. చౌకీదారు లోపలికి పరుగెత్తి దొంగని పట్టేశాడు. చుట్టూ మూగిన అంతా "దొంగెవడో కాడు. మొన్న జైలు నించి విడుదలయిన గదాధర్‌ట అని తమలో తాము అనుకున్నారు. పోలీసులు వచ్చారు. దొంగతనం జరిగింది మహాజన్ (ముస్పబు) గారింట్లో కనక ఇన్స్‌స్పెక్టర్ స్వయంగా వచ్చాడు. అయిదు వేల రూపాయలు వున్న కాష్ బాక్స్ తెరుస్తుండగా పట్టుపడ్డాడని ఇన్‌స్పెక్టర్ ఛార్జీషీట్ చేశాడు. కొన్నాళ్ళకి కోర్టులో వాడి నేరం రుజువయి 457. 380 సెక్షన్ ప్రకారం జైలు శిక్ష విధించారు. తీర్పు విని గదాధర్ నిశ్చింతగా నిట్టూర్చాడు

○ ○ ○

కొన్ని రోజుల తర్వాత మామూలు జైలు నించి సెంట్రల్‌జైలుకి మార్చారుగదాధర్‌ని. గదాధర్ పూర్వ పరిచితమైన జైలు గేటు దగ్గిరకి రాగానే వాడి మొహం సంతోషంతో నిండింది. చేజారిన వస్తువు ఏదో మళ్ళీ చేజిక్కినంత సంబరంగా వుంది వాడికి. జైలు సూపరింటెండెంట్ గారికి నమస్కారం చేసి "అయ్యగారూ, తిరిగి వచ్చాను. నాకు ముందిచ్చిన పనినే యిప్పించండి" అని ప్రార్థించాడు చేతులు జోడించి.

జైలు గేటు తెరుచుకుంది. గదాధర్ మహదానందంగా లోపలికి వచ్చాడు. సాహెబ్ ఆశ్చర్యంగా నోరు తెరుచుకుని చూస్తూ - "ఏ జైల్ బర్డ్ ఇన్‌డీడ్" అన్నాడు పైకే.

✻



